


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల

నిర్మల్ - కొమరం భీం

ఆసిఫాబాద్

బుధవారం 18 ఫిబ్రవరి 2026 పేజీలు 03


## మ్యాపింగ్ ప్రక్రియ

# పకడ్బందీగా చేపట్టాలి

### - రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు– కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ., ఏ.ఈ.ఆర్.ఓ లతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్‌లో సహాయకులుగా నియమించి మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏ ఈ ఆర్ ఓ లు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రియ చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫారం 6,7,8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.



జిల్లా ఎన్నికల అధికారి – కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులతో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా

# చేపట్టాలి

### - రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రత్యేక సమగ్రత సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోల్ అధికారి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు – కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులు, తహసిల్దార్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితాను ఎ, బి, సి, డి కేటగిరీలుగా మ్యాపింగ్ చేయాలని, బూత్ స్థాయి అధికారుల ఖాళీలను భర్తీ చేయాలని, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి సమాచారం సేకరించాలని తెలిపారు. రాజకీయ పార్టీల నుండి బూత్ స్థాయి ఏజెంట్ల జాబితా సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.

జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత, అదనపు కలెక్టర్ డేవిడ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆ దిశగా ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామని, బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి ఇంటిని సందర్శించి సమాచారం సేకరిస్తున్నారని తెలిపారు. ఓటరు జాబితాను ఎ, బి, సి, డి కేటగిరీలుగా విభజించి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని, మ్యాపింగ్ ప్రక్రియలు ఎలాంటి పొరపాట్లు జరగకుండా పర్యవేక్షిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల నుండి బూత్ స్థాయి ఏజెంట్ల జాబితా సమర్పించే విధంగా చర్యలు తీసుకుంటామని, ఫారం 6, 7, 8 పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## సేవాలాల్ చూపిన మార్గం

# అందరికీ మార్గదర్శకం

### - జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్,ఫిబ్రవరి 17,సూర్య మేజర్ న్యూస్:**

సంత్ సేవాలాల్ చూపిన మార్గం అందరికీ మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ లో గిరిజన సంక్షేమ శాఖ, సేవాలాల్ జయంతి నిర్వహణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సద్గురు సంత్ సేవాలాల్ 20087వ జయంతి కార్యక్రమానికి ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి పాల్గొని సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించిన బోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ చూపిన మార్గంలో మనమందరం నడుద్దామని తెలిపారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని, బంజారా సమాజాభివృద్ధికి విశేష కృషి చేశారని, భారతీయ సామాజిక సంఘసంస్కర్తగా ప్రసిద్ధి చెందారని తెలిపారు. గిరిజనులు విభిన్న సంస్కృతి, సాంప్రదాయాలను కలిగి ఉంటారని, సమస్త జీవకోటికి మాతృరూపం తల్లిగా వెలసిన అమ్మ భవాని ని పూజించాలని బోధించారు. హింస పాపమని, మత్తు, ధూమపానానికి దూరంగా ఉండాలని తెలిపారు. సంత్ సేవాలాల్ కేవలం బంజారాలకే కాకుండా యావత్ ప్రజలందరికీ ఆదర్శ పురుషుడిగా ఆచరణీయ మార్గాన్ని అనుసరించారని, మహానుభావులు ఇచ్చిన స్ఫూర్తితో దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో బంజారా భవన్, సేవాలాల్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, బంజారా పెద్దలు, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







## ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన

# పూర్తి చేయాలి

### - జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్ ప్రతినిధి, సూర్య మేజర్ న్యూస్.**

మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మండలాల వారిగా పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇండ్లు మంజూరైన వారి మార్కౌట్ పూర్తి చేసి, పనులు ప్రారంభించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షిస్తూ ఉండాలని తెలిపారు. నిర్మాణాలు మందగించిన ప్రాంతాల్లో లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి రాజేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






## ఉద్రిక్తతల నడుమ క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా

### - వరుసగా రెండో రోజూ నిలిచిన ప్రక్రియ - రాళ్ల దాడిలో మంత్రి కారు ధ్వంసం - కోరం ఉన్నా ఎన్నిక నిలిపివేత -- బీఆర్ఎస్, సీపీఐ నిరసన



2లో

సూర్య www.suryaa.com



# నూతన గ్రంథాలయన్ని ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**



నార్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నూతన డిజిటల్ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యతో కలిసి కలెక్టర్ రాజర్షిష ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఈ గ్రంథాలయం మంచి అవకాశమని తెలిపారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఇది ఉపయోగకరమని చెప్పారు. డిజిటల్ యుగాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన సిస్టమ్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. భారత్ దేకో సంస్థ ద్వారా ఐదు ల్యాప్‌టాప్‌లు అందించబడినట్లు తెలిపారు. వీటి ద్వారా విద్యార్థులు ఆన్‌లైన్ కోర్సులు, మోటివేషనల్ వీడియోలను ఉచితంగా వీక్షించవచ్చన్నారు. గ్రంథాలయంలో పుస్తకాలతో పాటు వార్తాపత్రికలు, మ్యాగజైన్లు అందుబాటులో ఉంచాలని, గ్రామ పంచాయతీ సమన్వయంతో నిర్వహణ చేపట్టాలని సూచించారు. మండలంలో ఐటీ స్కిల్ సెంటర్, ఇంగ్లీష్ ఫౌండేషన్ లెర్నింగ్ ప్రోగ్రామ్, త్వరలో ట్రైబల్ మ్యూజియం ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువత వ్యసనాలు, మొబైల్ దృష్టి మరల్చే అలవాట్లకు దూరంగా ఉండి వసతులను వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు

మెరుగుపడతాయని అన్నారు ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు ఆధునిక వసతులు కల్పించడం వల్ల పట్టణ విద్యార్థులతో సమానంగా పోటీ పడగలరన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, సర్పంచ్ కావేరీ, డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, నీతి ఆయోగ్ ప్రోగ్రామ్ అధికారి రాహుల్, ఎంపీడీవో పుల్లారావు, తహసిల్దార్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్రిక్తతల నడుమ క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా

### - వరుసగా రెండో రోజూ నిలిచిన ప్రక్రియ - రాళ్ల దాడిలో మంత్రి కారు ధ్వంసం - కోరం ఉన్నా ఎన్నిక నిలిపివేత -- బీఆర్ఎస్, సీపీఐ నిరసన

**రామకృష్ణాపూర్ ఫిబ్రవరి 17, సూర్య మేజర్ న్యూస్**

క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఉద్రిక్త పరిస్థితుల కారణంగా వరుసగా రెండో రోజు వాయిదా పడ్డాయి. సోమవారం



కోరం లేక ఎన్నిక వాయిదా పడగా, మంగళవారం అన్ని పార్టీల కౌన్సిలర్లు సమావేశానికి హాజరైనప్పటికీ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో అధికారులు ఎన్నికను నిలిపివేశారు. ఎక్స్ అఫిషియో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మంచిర్యాల ఎంపీ వంశీ కృష్ణ, కార్మిక--మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి క్యాతనపల్లికి వస్తున్న సమయంలో మంత్రి కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనలో మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రయాణిస్తున్న వాహనం ధ్వంసమైంది. దీంతో ఒక్కసారిగా పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పరస్పరం రాళ్ల దాడులకు పాల్పడ్డారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ నిర్వహించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని ఉన్నత పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ ఘర్షణల్లో జైపూర్ ఏసీపీ గన్‌మ్యాన్‌కు, పలువురు కానిస్టేబుళ్లకు, అలాగే కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### సమావేశం నుంచి నిష్క్రమించిన మంత్రి, ఎంపీ

మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానున్న సమయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీ కృష్ణ సమావేశం నుంచి నేరుగా వెళ్లిపోయారు.

### అధికారికంగా ఎన్నిక వాయిదా

రెండో రోజు సమావేశానికి కోరం ఉన్నప్పటికీ సభ్యుల మధ్య తోపులాటలు, దాడుల కారణంగా ఎన్నికను వాయిదా వేయాల్సి వచ్చిందని ఎన్నికల ప్రత్యేకాధికారి, మండల తహసీల్దార్ సతీష్ కుమార్ శర్మ తెలిపారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిన తర్వాత ఎన్నికల తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

### ఎన్నికలు నిర్వహించాలని నిరసన

కోరం ఉన్నా అధికారులు కావాలనే ఎన్నికను వాయిదా వేశారని బీఆర్ఎస్, సీపీఐ సభ్యులు ఆరోపించారు. మంత్రి మెప్పు కోసమే ఎన్నిక నిలిపివేశారంటూ మున్సిపల్ కార్యాలయంలోనే నిరసనకు దిగారు. వెంటనే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించాలని, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## రెండవ రోజు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా

**ఖానాపూర్ ,సూర్య మేజర్ న్యూస్ :**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉత్కంఠంగా మారింది. ఖానాపూర్ మున్సిపల్ పీఠం ఎన్నిక రెండోసారి వాయిదా పడింది. మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. సోమవారం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నూతన ఎన్నికైన ముగ్గురు




కౌన్సిలర్లు, ఇండిపెండెంట్ కౌన్సిలర్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్తో ఎన్నికల కేంద్రానికి చేరుకొన్నారు. అనంతరం అధికారులు వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఎన్నికల కేంద్రానికి చేరుకుపోవడంతో సోమవారం మధ్యాహ్నం ఒకటిన్నర వరకు రాలేకపోవడంతో అధికారులు చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా వేస్తూ మంగళవారం మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని అధికారులు తెలిపారు. మంగళవారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉండగా, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ఎన్నికల కార్యాలయానికి క్యాంపు నుండి మధ్యాహ్నం వరకు రాకపోవడంతో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ పీఠం ఎన్నిక వాయిదా పడ్డది. చైర్మన్ పదవి విషయంలో ఇరు పార్టీల నడుమ బేరసరాలు కుదరడం లేదని తెలుస్తుంది. మంగళవారం ఎన్నికల కార్యాలయంకు ముగ్గురు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు (అభ్యర్థులు), ఇండిపెండెంట్ అభ్యర్థి, ఎమ్మెల్యే బొజ్జు పటేల్తో హాజరయ్యారు.

## వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

**కౌటాల 18 ఫిబ్రవరి సూర్య మేజర్ న్యూస్**

రైతు వేదికలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు 5 రోజుల శిక్షణ తరగతులను మంగళవారం. ఎంపిడిఓ ప్రసాద్ ప్రారంభించారు. పంచాయతీ



రాజ్ చట్టం 2018 లో వార్డు సభ్యుల పాత్ర మరియు గ్రామాల అభివృద్ధికి వారు చేయవలసిన విధులు బాధ్యతలు పట్ల వివరించారు. ఇట్టి కార్యక్రమంలో మాస్టర్ ట్రేనర్లు హరీష్ , అంకులు, రఘు కుమార్, ప్రణీత్, మరియు, వార్డు సభ్యులు, కార్యదర్శులు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కెసిఆర్ జన్మదినాన్ని వేడుకలు

**సిరికొండ ఫిబ్రవరి 17, సూర్య మేజర్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన నాయకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిరికొండ మండల కేంద్రంలోని గాంధీచౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నాయకులు కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, అనంతరం కేక్ కట్ చేసి



పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఓరగంటి పెంటన్న, మాజీ ఎంపీపీ అమృత్‌రావు, పోచంపల్లి సర్పంచ్ విజయకుమార్, సుంకిడి మాజీ సర్పంచ్ రోహిదాస్ మాట్లాడుతూ కెసిఆర్ ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు బడుగు--బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారనన్నారు. రానున్న రోజుల్లో పార్టీ మళ్లీ అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్ శ్రేణులు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో తొలి ముఖ్యమంత్రి జన్మదినాన్ని నాయకులందరూ కలసి జరుపుకోవడం సంతోషకరమని, ఇలాంటి మరిన్ని వేడుకలు జరగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సోంపల్లి మాజీ సర్పంచ్ సూర్యకాంత్, మాజీ ఎంపీటీసీ వాయుపేట్ గుండాల రాజారాం, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎం.డి.ఏక్బల్,మాజీ ఉపసర్పంచ్ చిన్నరాజన్న,సీనియర్ నాయకులు గంగాధర్, ప్రభాకర్ పటేల్, గంగన్న, లక్ష్మన్న, భీమ్రావు, మిలన్,నర్సింలు,గణేష్, నరేష్,రాజేష్,రాజు,సిరికొండ,సోంపల్లి,పోచంపల్లి,పొన్న,తుమ్మలపాడు, చిమ్మన్‌గూడి, ఫకీర్ నాయక్ తండా, సాత్‌మెరి, వాయుపేట్ ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జన్నారంలో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు

**జన్నారం, ఫిబ్రవరి 17, సూర్య మేజర్ న్యూస్ :** జన్నారంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కేసీఆర్ ఫోటోతో ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనుడు కేసీఆర్ జన్మదిన వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గుర్రం రాజారాం రెడ్డి అన్నారు. అనంతరం స్థానిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో మండల ప్రధాన కార్యదర్శి సుల్వ జనార్ధన్, మండల మాజీ అధ్యక్షులు సిటిమల భరత్ కుమార్, నాయకులు సుతారి వినయ్ కుమార్, జాడి గంగాధర్, సాయిని ప్రసాద్ నేత, ఆడెపు లక్ష్మి నారాయణ, ఐలవేని రవి, బాలసాని శ్రీనివాస్ గౌడ్, కళ్యాం శ్రీనివాస్ రెడ్డి, రాకేష్, పురుషోత్తం, దుమాళ్ళ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం

**ఉట్నూర్ ,సూర్య మేజర్ న్యూస్:** ఇటీవల ఆత్మహత్య చేసుకుని మరణించిన డయాలసిస్ టెక్నీషియన్ రాథోడ్ సాయి కిరణ్ కుటుంబాన్ని అపెక్స్ కిడ్నీ కేర్ సంస్థ ప్రతినిధులు పరామర్శించారు. సంస్థ తరపున సాయి కిరణ్ కుటుంబానికి రూ. 10,00,000 పది లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈ క్రింది వారు పాల్గొన్నారు. అపెక్స్ కిడ్నీ కేర్ ప్రతినిధులు మంజుకర్ రెడ్డి హెచ్ ఆర్ అపెక్స్ కిడ్నీ కేర్ కదిరి కిషోర్ క్వాలిటీ మేనేజర్ జీవన్ ప్రజ్ఞాపురం క్లస్టర్ మేనేజర్ హాజరైన అధికారులు ఈ ఆర్థిక సాయాన్ని మెడికల్ సూపర్ ఇన్ టెండెంట్ డాక్టర్ ఉపేందర్ జాదవ్ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇతర ముఖ్యులు కూడా పాల్గొన్నారు. డాక్టర్ మహేందర్ ఆర్ ఎమ్ ఓ ఫాతిమా రాణి నర్సింగ్ సూపర్ ఇన్ టెండెంట్ సజీద్ జూనియర్ అసిస్టెంట్, డి హెచ్ ఉట్నూర్ కష్టకాలంలో ఉన్న ఉద్యోగి కుటుంబానికి అండగా నిలిచిన అపెక్స్ కిడ్నీ కేర్ యాజమాన్యాన్ని మరియు అధికారులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.



# ఉద్యోగులకు చెందాల్సిన అన్ని ప్రయోజనాలను త్వరగా అందించాలి

## - ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ

**మందమర్రి, ఫిబ్రవరి 17, సూర్య మేజర్ న్యూస్.**

ఉద్యోగులకు చెందాల్సిన అన్ని ప్రయోజనాలు, హక్కులు వెంటనే చేరేలా సంబంధిత శాఖలు, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, బెనిఫిట్స్‌ను వేగవంతంగా పరిశీలించి, ఉద్యోగులకు రావాల్సిన అన్ని బెనిఫిట్స్ ల చెల్లింపుల ప్రక్రియను పూర్తి చేసేందుకు కృషి చేయాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణా సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ



అధ్యక్షతన పర్సనల్ డిపార్ట్మెంట్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ పర్సనల్ డిపార్ట్మెంట్ కు సంబంధించిన పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఆయా శాఖ అధికారులకు సూచించారు. పదవీ విరమణ పొందిన మెడికల్, ఇన్వాల్యుయేషన్ అయిన ఉద్యోగుల గ్రాడ్యుటి, మెడికల్ కార్డు, సిఎంపిఎఫ్ సెటిల్మెంట్లను వీలైనంత త్వరగా యూనిట్ లెవెల్ లో, ఏరియా లెవెల్ లో పూర్తి చేసి సిఎంపిఎఫ్ కార్యాలయానికి పంపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం జి.ఎల్ ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, సీనియర్ పర్సనల్ అధికారి సత్యనారాయణ, అన్ని గనుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## పెంచికల్ పేట్ లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 17, సూర్య మేజర్ న్యూస్ :**

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి, మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడంతో పెంచికల్ పేట్



మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాణా సంచా కల్సి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యంఅవుతుందని అన్నారు.మున్సిపల్ గెలుపై కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో, కార్యకర్తల్లో నూతన ఉతతేజన్ని నింపిందన్నారు.ఈ సంబరాల్లో సర్పంచ్ షేక్ ఉస్మాన్, నాయకులు సముద్రాల రాజన్న, రాచకొండ కృష్ణ.కొలిపాక శ్రీనివాస్, ఉపసర్పంచ్ శేఖర్ తదితరులు ఉన్నారు.

## ప్రశాంతంగా కాగజ్ నగర్ మున్సిపాలిటి చైర్మన్ , వైస్ చైర్మన్ ఎన్నిక. జిల్లా ఎన్నికలఅధికారి, కలెక్టర్ హరిత

**కాగజ్నగర్ ,ఫిబ్రవరి 17, సూర్య మేజర్ న్యూస్ :**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మున్సిపాలిటీ ఎన్నికలలో గెలుపొందిన కౌన్సిలర్లను మంగళవారం కాగజ్నగర్ పట్టణంలోని మున్సిపల్





సమావేశ మందిరంలో సమావేశపరచి మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ లను ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె హరిత తెలిపారు.మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్ట రేట్ సముదాయ భవనం లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా కాగజ్ నగర్ మున్సిపల్ ఎన్నిక ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరిత అదనపు కలెక్టర్ దీపక్ తివారి తో కలిసి పర్యవేక్షించారు. చైర్మన్గా షాహిన్ సుల్తానా వైస్ చైర్మన్ గా డాక్టర్ కొత్తపల్లి అనితను ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. అవాంచనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

**మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 17,సూర్య మేజర్ న్యూస్ :**

ఐ సి ఎస్ ఎస్ ఆర్ వారి ఆర్థిక సహకారం తో డిపార్ట్మెంట్ ఆఫ్ హిస్టరీ వారు ఏర్పాటుచేసిన "ఐరన్ మాన్స్ విషనరీ లీడర్షిప్ - లైబరేషన్ అఫ్ హైదరాబాద్ రెండు రోజుల జాతీయ సదస్సు తేదీ 17-02-2026 నుండి 18-02-2026 వరకు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్ లో ప్రారంభించారు.ఈ సెమినార్ నకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్. అడపా సత్యనారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ,ప్రొఫెసర్ దయాకర్ రావు, కాకతీయ యూనివర్సిటీ వారు విచేశారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షులు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓఝ మాట్లాడుతూ సెమినార్ యొక్క ముఖ్య ఉద్దేశం సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆలోచనలు, సంస్థానాల ఏకీకృతం గురించి వివరించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమం, తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో విలీనం అయ్యే అంశాల గురించి క్షుణ్ణంగా తెలిపారు . ఈ సెమినార్కు విచ్చేసిన వివిధ కళాశాలల అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థిని విద్యార్థులు సెమినార్లో వారి యొక్క పరిశోధన పత్రాలు సమర్పించారు .ఈ సెమినార్ యొక్క ప్రాముఖ్యతను, సెమినార్ యొక్క అంశాల గురించి కోఆర్డినేటర్ డాక్టర్ కె రాజయ్య , డిపార్ట్మెంట్ అఫ్ హిస్టరీ వారు సవివరంగా వివరించారు .ఈ సెమినార్ లో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్, మంచిర్యాల డిగ్రీ కళాశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు పాలుగోన్నారు.

## కత్తితో దాడి చేసి భర్తను హతమార్చిన భార్య

**మందమర్రి ఫిబ్రవరి 17, సూర్య మేజర్ న్యూస్.**

మతాంతర ప్రేమ వివాహం చేసుకుని, గృహ ఆర్థిక కలహాల నేపథ్యంలో భర్తపై ఆగ్రహపూర్వకంగా భార్య కత్తితో దాడి చేసి హతమార్చిన ఘటన పట్టణంలోని శాంతినగర్ లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని శాంతి నగర్ కు చెందిన ఎండి మోయిన్ (42) డ్రైవర్ గా పని చేస్తున్నాడు. 10 సం,,ల క్రితం చుక్కల అవంతిని మతాంతర వివాహం చేసుకోగా వీరిద్దరి మధ్య తరచూ ఆర్థిక లావాదేవీల విషయంలో చాలా రోజుల నుండి గొడవ జరుగుతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారు జామున మృతుని భార్య అవంతి తన భర్త మెడపై కత్తితో పలుమార్లు దాడి చేయడంతో బాధితునికి తీవ్ర రక్తస్రావమైంది. దాడి ఘటన సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్సై జి నరేష్ ఘటన స్థలానికి చేరుకొని కొన ఊపిరితో ఉన్న బాధితుడిని 108 అంబులెన్స్ సహాయంతో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి ఎండి ఫైజియా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి నరేష్ తెలిపారు.

## ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 17, సూర్య మేజర్ న్యూస్ :**

తెలంగాణ మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని ఐబీ



లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణ ఉద్యమం ద్వారా స్వ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడని కొనియాడారు. ఎన్నో త్యాగాలు చేసి తెలంగాణ సాధించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని వివరించారు. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలు నేటికీ దేశానికి ఆదర్శనీయమన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ప్రజలకు మేలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నల్మాసు కాంతయ్య,మాజీ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు చుంచు చిన్నయ్య, మాజీ డీసీఎమ్మెస్ చైర్మన్లు కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తిప్పని లింగయ్య, కౌన్సిలర్లు పెట్టెం తిరుపతి, మైలారపు సుధాకర్, ఎగ్గడి జమున, మాజీ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**దస్తురాబాద్‌లో....**

తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ స్థాపకుడు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు జన్మదిన సందర్భంగా దస్తురాబాద్ మండల



కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేకు కట్ చేసి మొక్కలు నాటడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ముడికే ఐలయ్య యాదవ్, గోపి, రాజు నాయక్, ఎండపెల్లి గంగన్న,రాములు,అరుగుల రాజనర్సయ్య, మణిక్యరావ్, శంకర్, విలాస్ యాదవ్, కిషోర్, విజయ్, రవి,తిరుపతి, రాజలింగు, శైలేందర్ గోపి, శివ, వంగల సాయి, మహేష్, రాము, శ్రీను, మరియు దస్తురాబాద్ మండల బి ఆర్ ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన గురుకుల విద్యార్థిని

**కడెం. సూర్య మేజర్ న్యూస్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి ఎస్వీఆర్ట్స్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ లో గల తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని ఎస్ బ్లెస్సినా ఉత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ శకుంతల తెలిపారు. ఈ సందర్భంగా బంగారు పతకం సాధించిన బ్లెస్సిన కు ప్రిన్సిపాల్ శకుంతల నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ సర్పంచ్ బొడ్డు రాజేశ్వరి స్పందన గంగన్న , ఉప సర్పంచ్ జాడి లక్ష్మీ ఆనంద్ ,జి.పి వార్డు సభ్యులు, పిఈటి సునీత పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు పోషకులు అభినందించారు.

## పంచాయతీ రాజ్ వ్యవస్థలో వార్డ్ సభ్యుల పాత్ర కీలకం

## - జిల్లా పంచాయతీ అధికారి డి వెంకటేశ్వరరావు

**నెన్నెల,ఫిబ్రవరి 17 ,సూర్య మేజర్ న్యూస్**

పంచాయతీరాజ్ వ్యవస్థలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో కీలకమని అందుకు తగ్గట్టుగా వార్డు సభ్యులు గ్రామ పాలనలో కీలక పాత్ర పోషించాలని అన్నాడు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మండలం లో నూతనంగా ఎన్నికైన వార్డ్ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన 5




రోజుల శిక్షణ కార్యక్రమంలో వార్డు సభ్యులు పంచాయతీరాజ్ చట్టం పూర్తి అవగాహన కల్పించుకొని గ్రామ పాలనలో పట్టు సాధించాలని కోరాడు. అనంతరం శిక్షకులు పంచాయతీ రాజ్ చట్టం, చట్టపరమైన నిబంధనలు మరియు అధికారాలు,గ్రామ సభ నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం ఆర్థిక వ్యవహారాలు నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహమ్మద్ అబ్దుల్ హై, ఎంపీవో శ్రీనివాస్, శిక్షకులు, నూతనంగా ఎన్నికైన వార్డ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి ఆలయంలో జాతర - ఆలయంలో భక్తులకు అన్నదానం

**పెంచికల్ పేట్,ఫిబ్రవరి 16,సూర్య మేజర్ న్యూస్ :** మండలంలోని పెంచికల్ పేట గ్రామ శివారులో గల భద్రకాళి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు కొనసాగుతున్న జాతర రెండవ రోజు భక్తుల తో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయంలో బారేగూడ గ్రామానికి చెందిన రేణిగుంట్ల రేఖ పెంటన్న దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మూడవరోజు ఉదయం ఐదు గంటలకు వీర ఖడ్గాలతో అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని భక్తులందరూ అధిక సంఖ్యలో హాజరవుతారని అన్నారు. జాతర సందర్భంగా మండల కేంద్రంలోని కిరణ్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్, తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు.



